క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



నూజివీడు: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. పతంగుల పోటీలలో పిల్లలు సందడి చేశారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వరరావు, సెక్రటరీ గాదె రామకృష్ణ, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ పరసా రంగారావు, రీజనల్ చైర్‌పర్సన్ కేవీ హనుమంతరావు, జిల్లా ఇన్‌చార్జి చిన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..



విస్సన్నపేట: సంక్రాంతి సందర్భంగా స్థానిక సెయింట్‌థెరిస్సా పాఠశాల ఆవరణలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ముగ్గుల పోటీలకు మహిళలు విశేషంగా పాల్గొని వివిధ రకాల రంగుల ముగ్గులు వేశారు. మొదటి బహుమతి కె గీతిక గెలుపొందగా రూ.20 వేలు నగదు బహుమతి అందజేశారు. రెండో బహుమతి 12 వేలు, మూడో బహుమతి రూ.8 వేలు అందజేశారు. సుజనా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ వికిరణ్, గ్రామానికి చెందిన గుత్తా శివ సుబ్రహ్మణ్యం దంపంతులు ,విశ్రాంత తెలుగు లెక్చరర్ ముంగా జయరాజు, పాఠశాల హెచ్ఎం సిస్టర్ జూలీయట్, న్యాయనిర్ణేతలుగా పద్మావతి, సాయిసుధా, గిరిజారాణి పాల్గొన్నారు.

నూజివీడు మాజీ సర్పంచ్ మృతి



నూజివీడు: నూజివీడు మాజీ సర్పంచ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు(93) ఆదివారం కన్నుమూశారు. ఈయన జీవితాంతం కాంగ్రెస్ పార్టీలో ఉండటంతో పాటు మాజీ మంత్రి దివంగత పాలడుగు వెంకట్రావుకు ప్రధాన అనుచరుడిగా కొనసాగారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆకుల వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని పలువురి సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

దుప్పట్ల పంపిణీ

ఏ.కొండూరు: పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని చారిటబుల్ ట్రస్టు మేనేజర్ ట్రస్టీ దేవరపల్లి అగ్గి రామయ్య పేర్కొన్నారు. పాత కొండూరులో దేవరపల్లి అగ్గి రామయ్య చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ప్రకటన

[illegible]

S. కోటిరెడ్డి, అడ్వకేట్.
విజయవాడ.
తేది 14 01 2024

ఆనందోత్సాహాలతో భోగి పండగ

తిరువూరు: సంక్రాంతి పండగలో తొలిరోజు భోగి పర్వదినాన్ని తిరువూరు ప్రాంత ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి, బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి సందిగొబ్బెమ్మలకు పూజలు చేయడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీవేంకటాచలస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, శ్రీరంగనాయకస్వామి ఆలయం, రాజుపేట వీరాంజనేయ స్వామి దేవస్థానాల్లో ధనుర్మాస ముగింపు సందర్భంగా గోదాదేవి కల్యాణం జరిపారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరంలో సంక్రాంతి సంబరాలు ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. ప్రతి ఇంటిలో పాలు పొంగించి, సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేస్తూ పరవాన్నం, పాయసం, పులిహోర, పిండివంటలతో కుటుంబ సమేతంగా సంతోషంగా గడిపారు. కుటుంబ సభ్యుల రాకతో గృహాలు నూతన కళను సంతరించుకున్నాయి. జగనన్న కాలనీల్లో మొదటిసారి సంక్రాంతిని జరుపుకోవడం సంతోషంగా ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో రుణపడి ఉంటామని లబ్ధిదారులు తెలియజేశారు.

నూజివీడులో..

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం భోగి పండగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇంట్లో పనికిరాని పాతవస్తువులను భోగిమంటలలో వేయడంతో పాటు ఆ మంటలలో కాగబెట్టిన నీళ్లను తీసుకెళ్లి పిల్లలు, పెద్దలు అభ్యంగన స్నానమాచరించి నూతన వస్త్రాలను ధరించారు. తమ పిల్లలపై ఉన్న కీడు తొలగిపోవాలని తల్లులు తమ పిల్లలకు భోగిపండ్లు పోశారు. ఆలయాలకు వెళ్లి ఇష్టదైవానికి పూజలు నిర్వహించారు.

ముసునూరులో..

ముసునూరు: మండల ప్రజలు భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. యువకులు, పెద్దలు ఆదివారం తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. గంగిరెద్దులు, హరిదాసులతో గ్రామాలు కళకళలాడాయి. మండలంలోని లోపూడి, గోపవరం, కాట్రేనిపాడుల్లో మధ్యాహ్నం నుంచి కొన్ని చోట్ల కోడిపందేలు నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో ఆదివారం భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు వేకువజామునే లేచి భోగిమంటలు వేసి భోగి నీళ్లతో అభ్యంగన స్నానాలు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి వారిని ఆశీర్వదించారు.



మైలవరం మండలం చిలుకూరువారిగూడెంలో ఏర్పాటు చేసిన భోగి మంట



నూజివీడులోని చిన్నగాంధీబొమ్మ సెంటర్లో భోగిమంట



ముసునూరు మండలం చెక్కపల్లిలో దిద్దిన రంగవల్లుల్లో గొబ్బెమ్మలు



తిరువూరులో భోగి సందర్భంగా బొమ్మల కొలువు



తిరువూరు కోదండ రామాలయంలో గోదాదేవి కల్యాణం

కోరికల నుంచి బయట పడటమే పండగ పరమార్థం

మైలవరం: భోగ భాగ్యాల కోరికల నుంచి బయట పడటమే నిజమైన భోగి పండగ అర్థం అని నర్రా శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి విశిష్టతను తెలియజేసేందుకు ఎన్‌టీఆర్ జిల్లా మైలవరం మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కంభం కమిటీ, దొనకొండ కమిటీల అధ్యక్షులు, సభ్యులు నర్రా శ్రీనివాసరెడ్డి, ఏడుకొండలు, కోటేశ్వరి, లక్ష్మి, నారాయణమ్మ, తిరుపతమ్మ, వెంకీ, శ్రీనివాసరెడ్డి, శ్రీను, కృష్ణరెడ్డి, కృష్ణ కోమలి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



మైలవరం ప్రచారంలో పాల్గొన్న త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఎమ్మెల్యే రక్షణనిధి పుట్టినరోజు వేడుకలు

తిరువూరు: స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వగ్రామమైన వల్లూరుపాలెంలో కేక్ కట్ చేసి రక్షణనిధికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, లక్ష్మీపురం, చింతలపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ తాళ్లూరి నవీన్, గుడిపూడి నారాయణరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నాయకులు పరసా నెహ్రూ, షేక్ జాకీర్, కాలసాని గోపాలనాగేశ్వరరావు, మేడా శ్రీనివాసరావు, పవన్, వాళ్ళ సురేష్, దొంగల నరసింహారావు, వంగూరి వెంకట్, రాజ్ మహ్మద్ పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పుట్టిన రోజు సందర్భంగా పలువురు మండల నాయకులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి దంపతులు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ, మండల యూత్ అధ్యక్షుడు అలీరహ్మాన్, సొసైటీ అధ్యక్షుడు గంటల నాగాచారి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణపతిరెడ్డి, నాయకులు హరి, వెంకటరత్నం, చెన్నారెడ్డి ఎమ్మెల్యేను కలసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న తిరువూరు వైఎస్సార్ సీపీ నాయకులు



ఎమ్మెల్యే రక్షణనిధికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, నాయకులు

ఘనంగా గోదాదేవి కల్యాణం

మైలవరం: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పుణ్య ప్రదమైన ధనుర్మాసంలో గత నెల రోజులుగా చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భోగి సందర్భంగా ఆదివారం ఆలయంలో గోదాదేవి కల్యాణం శ్రీఅలివేలు మంగతాయారు, శ్రీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన తనయులు ఎస్వీఎస్ నివృతరావు, ఎస్వీఎస్ నిరాహుల్‌రావు పాల్గొన్నారు.



గోదాదేవి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గంపలగూడెంలో..

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో గోదాదేవి అమ్మవారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిపారు. గంపలగూడెం రామాలయంలో అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, రామాచార్యులు, భజన మందిరంలో అర్చకులు బాదంపూడి శివరామప్రసాద్, పెనుగొలను ఆలయంలో అర్చకులు తిరునగరి భాస్కరాచార్యులచే రంగనాయకస్వామి, గోదాదేవి అమ్మవారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ధనుర్మాసం ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఆగిరిపల్లి వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు ప్రత్యేక పూజలు జరిపి గోదాదేవి కల్యాణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు.

ముసునూరులో..

ముసునూరు: శ్రీరంగనాథ సమేత, గోదాదేవి అమ్మవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. భోగి పండగ సందర్భంగా ఆదివారం లోపూడి కోదండరామాలయంలో తెల్లవారుజామునే దేవతామూర్తులకు సేవాకాలం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పెండ్లి కూతురు ముస్తాబులో తీసుకొచ్చి, అశేష భక్త జన సాక్షిగా ప్రధానార్చకులు కిరణ్‌కుమార్ బృందం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



గోసవీడు/పెనుగొలను(గంపలగూడెం): అయోధ్యలో ఈనెల 22న శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం అక్షింతల పంపిణీ చేశారు. గోసవీడు, పెనుగొలను గ్రామాల్లో ముందుగా అక్షింతల కలశాలను ఊరేగించారు. అనంతరం వాటిని గ్రామంలో పంపిణీ చేశారు.

హరిదాసుల సందడి



విస్సన్నపేట: మండలంలో భోగి పండగ సందర్భంగా ఆదివారం హరిదాసులు సందడి చేశారు. మండల ప్రజలు వేకువజామునే భోగి మంటలు వేయడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.